గుట్టలో శాస్త్రోక్తంగా తిరు కల్యాణోత్సవం

లక్ష్మీనరసింహుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరు కల్యాణోత్సవం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు కల్యాణోత్సవం జరిపించారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. స్వామి వారి నిత్యోత్సవాలు తెల్లవారు జాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పిన అర్చకులు తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా కొనసాగాయి. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ. 11,17,098 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత తెలిపారు.

హుండీకి వివిధ దేశాల కరెన్సీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి 24రోజుల హుండీల ఆదాయం కోటి రూపాయలు దాటిందని ఆలయ ఈఓ ఎన్.గీత తెలిపారు. కొండకింద గల సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో శనివారం హుండీలను లెక్కించగా రూ.1,69,83,021 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. 177 గ్రాముల మిశ్రమ బంగారం, 2కిలోల 500గ్రాముల మిశ్రమ వెండి సమకూరిందన్నారు. అమెరికాకు చెందిన 253 డాలర్లు, యూఏఈకి చెందిన 75 ధిరమ్స్, ఆస్ట్రేలియాకు చెందిన 80డాలర్లు, కెనడాకు చెందిన 40 డాలర్స్‌తో పాటు మలేషియా, ఇంగ్లాండ్, నేపాల్, సౌదీ అరేబియా, కువైట్, ఇజ్రాయిల్, థాయ్‌భట్ దేశాలకు చెందిన కరెన్సీ స్వామి వారికి సమకూరిందని తెలిపారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలి

- బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్

రంగాపూర్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు

బొమ్మలరామారం, అక్టోబర్ 7 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని సాధించే దిశగా పయనించాలని బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు సూచించారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలో గల హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో శనివారం నిర్వహించిన క్రీడోత్సవాలు -2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతు విద్యార్థి దశలో క్రీడలు ఏకాగ్రతకు, దేహదారుఢ్యానికి ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశ సేవ కోసం రక్షణ రంగంలో రావాలనుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి.యాదయ్య, హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కె.రాజ్‌కుమార్, డిఫెన్స్ చీఫ్ మెంటర్ టీవీ.రామకృష్ణ, ప్రిన్సిపాల్ మెగిలి, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు అంజయ్య, శ్రీనివాస్‌రావు, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు డబుల్ బెడ్రూం ఇల్లు

ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఉదారత

నానమ్మ ఎల్లమ్మతో అనాథ బాలలు

అర్వపల్లి, అక్టోబర్ 7 : మండలంలోని అడివెంల గ్రామానికి చెందిన అనాథ బాలలకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అండగా నిలిచారు. ఉడుగు హర్షవర్ధన్, తన్వీశ్‌కుమార్ తండ్రి నాలుగేండ్ల క్రితం మృతిచెందగా తల్లి రూన్సీ మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో చిన్నారులు ఒంటరివారై నానమ్మ దగ్గర జీవిస్తున్నారు. వీరికి కనీసం ఉండేందుకు ఇల్లు లేని విషయాన్ని తెలుసుకుని చలించిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించారు. అడివెంలలో శనివారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపికలో ఈ అనాథ బాలలకు అధికారులు ఇల్లు కేటాయించారు. ఎమ్మెల్యే నిర్ణయాన్ని గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

- ప్రారంభించిన ఎమ్మెల్యే నోముల భగత్

నందికొండ, అక్టోబర్ 7 : ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతులు కోరిన విధంగానే ప్రతి ఏటా సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల చేస్తున్నట్లు నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ తెలిపారు. నందికొండ పొట్టిచెలిమె సమీపంలోని ఎడమ కాల్వ హెడ్ రెగ్యులెటర్ వద్ద పూజలు నిర్వహించి శనివారం ఎడమ కాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా 9 ఏండ్లలో రెండు పంటలకు నీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల నీరు సమృద్ధిగా లేకపోయినా ఎడమ కాల్వ ఆయకట్టు కింద వరి పొలాలు ఎండిపోవద్దన్న సీఎం కేసీఆర్ ఆదేశంతో నీటి విడుదలను చేపట్టినట్లు తెలిపారు. గతేడాది కృష్ణా బేసిన్‌లో నీరు పుష్కలంగా ఉండడంతో జూన్ నెలలో ఎడమ కాల్వకు నీటి విడుదల చేసి 2.98లక్షల ఎకరాలకు నీరు అందించినట్లు చెప్పారు. ఈ ఏడాది కృష్ణానదిలో నీరు లేకపోవడంతో వర్షాలు పడుతాయని రైతాంగం ఎడమ కాల్వ కింద ఆయకట్టులో లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారని, వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో పొలాలకు నీరు అందించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, రైతులు సీఎంను కోరారు. దాంతో సీఎం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి ఎడమ కాల్వకు నీటి విడుదల చేపట్టారన్నారు. ఎడమ కాల్వకు 10 రోజుల పాటు 5 టీఎంసీల నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. మొదటి జోన్ వరకు నీరు అందుతుందని, రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఎన్ఎస్పీ ఎస్ఈ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎడమ కాల్వకు నీటి విడుదలను 500 క్యూసెక్కులతో ప్రారంభించామని, క్రమంగా పెంచుకుంటూ వెయ్యి నుంచి 4 వేల క్యూసెక్కుల వరకు వదులుతామన్నారు. ప్రతి రోజు 0.5 టీఎంసీల చొప్పున 10 రోజుల పాటు 5 టీఎంసీల నీటిని ఎడమ కాల్వకు విడుదల చేస్తామని, మొదటి జోన్ వరకు నీరు అందుతుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం నీటి విడుదల కొనసాగుతుందన్నారు. అలాగే ఆంధ్ర ప్రాంతం వారికి తాగునీటి అవసరాల కోసం కుడి కాల్వకు నీటి విడుదలను ప్రారంభించామని, 5 టీఎంసీల వరకు నీటిని విడుదల చేస్తామని ఎన్ఎస్పీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్న అనుశాశరత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కర్న బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మంద రఘువీర్, కో ఆప్షన్ మెంబర్ బషీర్, ఎన్ఎస్పీ ఈఈ మల్లికార్జున, ఏఈలు కృష్ణయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న పంపిణీ చేస్తున్న ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి

ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా చీరెలు

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్
- భీమారంలో ఎమ్మెల్యే చిరుమర్తితో కలిసి పంపిణీ

కేతేపల్లి, అక్టోబర్ 7 : ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా ప్రభుత్వం చీరెలను పంపిణీ చేస్తున్నదని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. మండలంలోని బీమారం గ్రామంలో శనివారం ఆయన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. అనంతరం సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు, జనరల్ కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు అన్ని విధాలుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఆడబిడ్డల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మి, దసరా పండుగకు బతుకమ్మ చీరెలను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రపంచానికి తెలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. దేశ విదేశాల్లో సైతం మన ఆడబిడ్డలు బతుకమ్మ సంబురాలు చేసుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందన్నారు. రంజాన్ పండుగకు ముస్లింలకు, క్రిస్మస్‌కు క్రైస్తవులకు దుస్తులు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. గ్రామ సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ బొప్పని స్వర్ణలత, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిముట వెంకన్నయాదవ్, నాయకులు జి.నాగరాజు, కె.యాదగిరిగౌడ్, సయ్యద్ ఫరీద్, జి.వెంకటయ్య, పజ్జూరి విష్ణు, పాల్గొన్నారు.

అభివృద్ధికి మద్దతుగా బీఆర్ఎస్‌లో చేరికలు

గరిడేపల్లి : గారకుంట తండా వార్డు సభ్యురాలు భవానికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

గరిడేపల్లి, అక్టోబర్ 7 : ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తెలిపారు. మండలంలోని గారకుంట తండాకు చెందిన మూడో వార్డు సభ్యురాలు బచ్చలకూరి భవానీమట్టయ్య పలువురితో కలిసి శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. దీంతోనే వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నాగయ్య, వీరమ్మ, భిక్షంతో పాటు మరో 10మంది ఉన్నారు. అదేవిధంగా సర్వారం గ్రామ సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో 10కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో తేళ్ల అంజయ్య, రవి, బరిగెల సైదులు, నామవరపు వెంకటరత్నం, బరిగెల వెంకటేశ్వర్లు, కిశోర్, ఆదాం ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్, జడ్పీటీసీ పోరెడ్డి శైలజా రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, తండా సర్పంచ్ గుగులోతు బాబూనాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాణోతు సైదానాయక్, పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, డైరెక్టర్ హేమ్లానాయక్, నాయకులు మాశెట్టి శ్రీహరి, కుక్కడపు గుర్వయ్య పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలతో బంతి సాగు

అర్వపల్లి మండలం పర్సాయపల్లికి చెందిన రైతు జువ్వాజి భద్రయ్య 71వ డిస్ట్రిబ్యూటరీ కింద కాళేశ్వరం జలాలతో తన కున్న రెండున్నర ఎకరాల భూమిలో రెండెకరాలు వరి సాగు చేయగా, మిగిలిన అరెకరంలో మూడేండ్లుగా బంతి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పంట చేతికి వస్తున్నది.

– అర్వపల్లి, అక్టోబర్ 7